## ఆదివాసీ గర్భిణికి అవస్థలు

**రహదారి సౌకర్యంలేక పురిటి నొప్పులతో ఇబ్బందులు**

**మంచాన్ని డోలిలా కట్టి పీహెచ్‌సీకి తీసుకెళ్లిన గ్రామస్తులు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలో ఘటన**



మంచాన్ని జోలెలా కట్టి అందులో గర్భిణిని పడుకోబెట్టుకొని మోసుకెళ్తున్న గ్రామస్తులు

పినపాక, జూన్ 8: సరైన రోడ్డు మార్గంలేక, అంబులెన్స్ వెళ్లే వీలులేక ఓ ఆదివాసీ గర్భిణి పురిటి నొప్పులతో అవస్థలు పడిన హృదయ విదారక ఘటన భద్రాద్రి జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. పినపాక మండలం లోని తోగ్గూడెం పంచాయతీ ఉమేశ్‌చంద్రనగర్‌కు చెందిన మొడియం జానకి అనే ఆదివాసీ గర్భిణికి ఆదివారం పురిటి నొప్పులు మొదలయ్యాయి. కుటుంబ సభ్యులు ఆ గర్భిణిని తీసుకెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేదు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఆ వాహనం చేరుకునే ప్రయత్నం చేసినా.. రహదారి సరిగా లేని కారణంగా అది మధ్యలోనే ఆగిపోయింది. ఇంతలో గర్భిణికి పురిటి నొప్పులు కూడా ఎక్కువయ్యాయి. దీంతో గ్రామ యువకులు కొందరు ఓ మంచాన్ని జోలెలా కట్టారు. అందులో ఆ గర్భిణికి పడుకోబెట్టి చాలాదూరం వరకూ అటవీ మార్గంలో నడుచుకుంటూ వెళ్లారు. అంబులెన్స్ వరకూ చేరుకున్నాక ఆమెను అందులో ఎక్కించుకొని జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పాలతో అర్చన

భద్రాచలం, జూన్ 8: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం, నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

### భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న పాలకుర్తి ఎమ్మెల్యే



రామయ్య సన్నిధిలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

భద్రాచలం, జూన్ 8: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద, గర్భగుడిలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఆలయంలోని అభయాంజనేయ స్వామి, లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయాలను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## 'మాగంటి'కి భద్రాద్రితో విడదీయరాని బంధం



భద్రాద్రి రాముడిని దర్శించుకునేందుకు వచ్చిన మాగంటి గోపీనాథ్ (ఫైల్)

భద్రాచలం, జూన్ 8: జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ హైదరాబాద్‌లో ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. మాగంటి గోపీనాథ్‌కు భద్రాచలంతో విడదీయరాని బంధం ఉంది. గతంలో భద్రాద్రి రాముడు సినిమాను నిర్మించగా ఇక్కడే చాలా వరకు సినిమాలోని సన్నివేశాలను చిత్రీకరించారు. ఇదిలా ఉండగా తెలుగుదేశం పార్టీ నాయకునిగా గతంలో ఉన్న క్రమంలో ఆయన భద్రాచలం వచ్చినప్పుడు ప్రతి సందర్భంలో స్థానిక టీడీపీ నాయకులు ఆయన్ను కలిసేవారు. పలుమార్లు భద్రాచలం, పర్ణశాల ఆలయాల సందర్శన నిమిత్తం ఆయన వచ్చారు.

## విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సన్మానిస్తున్న సీఐ నాగబాబు

మణుగూరు టౌన్, జూన్ 8: మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో మండలంలోని కమ్మ సామాజిక వర్గంలోని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆదివారం సత్కరించారు. 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన అంచుమల్ల సిరి, తమ్మినేని సాత్విక, దొడ్డపనేని వర్శిణి, మందలపు దీక్షిత, గోగినేని సాయిసంహిత, దమ్మాలపాటి జ్వలితా చౌదరిని సీఐ నాగబాబు, పుర ప్రముఖులు సత్కరించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన ఉడతానేని రామారావు మాట్లాడుతూ... ఉత్తమ పలితాలు సాధించిన విద్యార్థులకు ఆరు సంవత్సరాలు పాటు ప్రతీ ఒక్కరికీ రూ.10వేలు అందజేస్తామని ఈ స ందర్భంగా ప్రకటించారు. కార్యక్రమంలో మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఇల్లెందు రూరల్, జూన్ 8: మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో 2005వ సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు పలకరించుకుని, నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులు మోహన్‌రావు, రాకం శ్యామ్‌బాబు, కేవీ రామారావు, శ్రీనివాస్, హరిసింగ్, ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం నాగమణిని సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు చందు, ప్రసాద్, సురేశ్, రమేశ్, శ్రీను, కృష్ణవేణి, మమత తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# కమలాపురంలో తాగునీటి కటకట



ములకలపల్లి: ట్యాంకర్‌తో ఇంటింటికీ నీటిని అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

ములకలపల్లి, జూన్ 8: మండలంలోని కమలాపురం (పాతూరు)లో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. గ్రామానికి తాగునీరు సరఫరా చేసే డైరెక్టు పంపింగ్ పథకానికి సంబంధించిన మోటారు వారం రోజుల క్రితం కాలిపోయింది. అప్పటి నుంచి గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. అసలే వేసవికాలం కావడంతో గృహవసరాలతోపాటు పశువులకు తాగునీటి తీవ్ర ఇక్కట్లు నెలకొన్నాయి. దీంతో పంచాయతీ అధికారులు ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీరే గ్రామస్తులకు ఆధారమైంది. అయితే, ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీరు గృహావసరాలకు సరిపోవడం లేదంటూ గ్రామస్తులు వాపోతున్నారు. సుమారు అరవైకి పైగా నివాస గృహాలు గల ఆ గ్రామానికి డైరెక్టు పంపింగ్ స్కీం (డీపీఎస్) ఒక్కటే తాగునీటి ఆధారం. నాలుగు రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కాగా, గ్రామంలో నీటి ఎద్దడి కారణంగా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మొదలుపెట్టిన వారు కూడా.. తమ నిర్మాణ పనులను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ప్రభుత్వం మాత్రం నిర్మాణాలను వేగవంతం చేయాలంటూ లబ్ధిదారులను ఉరుకులు పరుగులు పెట్టిస్తుండడం గమనార్హం. అయితే, పంచాయతీ అధికారులు ఎప్పుడు స్పందిస్తారో, మోటారుకు ఎప్పుడు మరమ్మతులు చేయించి గ్రామస్తులకు తాగునీటి ఎప్పుడు అందిస్తారో చూడాలి.

**నీటి సమస్యను పరిష్కరించండి**

టేకులపల్లి, జూన్ 8: మండలంలోని గోలియతండా పంచాయతీ పరిధిలో 20 రోజుల నుంచి నీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గోలియతండా గ్రామ పంచాయతీలోని సంత వీధి, హరిజనవాడ, గుగులోత్ చంద్రు వీధిలో ఇరువై రోజులుగా తాగు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల సంత ప్రాంగణంలో భగీరథ ట్యాంక్ ఔట్‌లెట్ పగిలి నీళ్లు వృధాగాపోతున్నాయి. దీంతో సమీప ఇళ్లలోని నీళ్లు రావడం లేదు. నీటి సమస్యను పరిష్కారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై గోలియాతండా పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా మిషన్ భగీరథ ట్యాంక్ ఔట్లెట్ పగిలిపోయిందని నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# జలపుష్పాలకు భలే గిరాకీ



జూలూరుపాడు: ప్రధాన రహదారి పక్కన చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

జూలూరుపాడు, జూన్ 8 : మృగశిర కార్తె మొదటి రోజు జలపుష్పాలకి డిమాండ్ బాగా పెరిగింది. అనాదిగా వస్తున్న నమ్మకంతో మృగశిర కార్తె రోజు చేపలు తింటే మంచి ఆరోగ్యవంతంగా ఉంటారని ఎలాంటి వ్యాధులు దరిచేరవనే నానుడి వాడుకలో ఉండటంతో చేపలకి గిరాకీ పెరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు మండల కేంద్రంలో ఆదివారం రోడ్ల పక్కన చేపలు పోసి విక్రయించడంతో జనం బారులు తీరి కొనుగోలు చేశారు. రవ్వలు, కొర్రమేను, బురదమట్ట, వాలుగ, గ్యాస్ కట్ రకాలకు చెందిన చేపలను విక్రయించారు. సాధారణ రోజుల్లో కేజీ ధర రూ.120 నుంచి 140 వరకు విక్రయిస్తుంటే ఉంటే మృగశిర కావడంతో కేజీ రూ.180 నుంచి రూ.250 వరకు అధికంగా రేటు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వచ్చిందని కొనుగోలుదారులు వాపోయారు.

**బూర్గంపహాడ్‌లో..**

బూర్గంపహాడ్, జూన్ 8: మండలంలోని సారపాకలో మృగశిర సందడి నెలకొన్నది. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో చేపల మార్కెట్లు కళకళలాడాయి. వినియోగదారులు తెల్లవారుజామునే చేపల మార్కెట్‌కు చేరుకుని చేపలను కొనుగోలు చేశారు. రోహిణి కార్తె పూర్తికాగానే తొలకరి చినుకులను మోసుకువచ్చే మృగశిర కార్తె వస్తుంది. మృగశిర కార్తె సందర్భంగా చేపలు కొనుగోలు చేసేందుకు ఎక్కువ మందిఇష్టపడుతుంటారు.

**అన్నపురెడ్డిపల్లిలో..**

అన్నపురెడ్డిపల్లి, జూన్ 8: మృగశిర కార్తె రోజు చేపలను తింటే వ్యాధులు దరి చేరవని నమ్మకంతో ప్రజలు చేపలను కొనుగోలు చేయడంతో చేపలకు మంచి డిమాండ్ పెరిగింది. ఉదయం నుంచి చెరువుల వద్ద చేపల కోసం బారులు తీరారు.

**చంద్రుగొండలో..**

చంద్రుగొండ, జూన్ 8: మృగశిర కార్తె సందర్భంగా ఆదివారం చేపల విక్రయాలు జరిగాయి. మృగశిర కార్తె తొలిరోజున చేపలు తింటే అన్ని రోగాలకు పనిచేస్తుందని నమ్మకంగా పూర్వ నుంచి వపస్తుంది. కిలో చేపలు రూ. 130- 200ల వరకు గ్రామాల్లో విక్రయాలు జరిగాయి.







బూర్గంపహాడ్: సారపాకలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు, చంద్రుగొండ: చేపలు విక్రయిస్తున్న ప్రజలు, జూలూరుపాడు: చేపలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

## నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా



ఇల్లెందు: మాట్లాడుతున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు, జూన్ 8: బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు అన్ని మండల కేంద్రాల్లో సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు అందించాలని, ఆరు గ్యారెంటీలలోని 13 అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని జగదాంబ సెంటర్‌లో గల తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఇల్లెందు మండల అధ్యక్షుడు శీలం రమేశ్, నాయకులు అబ్దుల్ నబి, అజ్మీర బావ్‌సింగ్,మాజీ కౌన్సిలర్ జెకె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**మణుగూరు టౌన్..**

మణుగూరు టౌన్, జూన్ 8: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపు మేరకు సీతారామా ప్రాజెక్టు నీళ్లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సాగు భూములకు అందించాలని, ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటల కు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత మణుగూరు బీఆర్ఎస్ కార్యాలయం నుంచి అంబేద్కర్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న స్టేట్ హౌజింగ్ బోర్డు చీఫ్ ఇంజినీర్ చైతన్యకుమార్

ఇల్లెందు రూరల్, జూన్ 8: మండలంలోని పూబెల్లి పైలెట్ ప్రాజెక్టు కింద మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ చీఫ్ ఇంజినీర్ చైతన్య కుమార్ ఆదివారం సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజినీర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా అర్హులైన లబ్ధిదారులకు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పూబెల్లిలో 83 ఇళ్ళు మంజూరయ్యాయని వాటిలో 63 ఇంటి పనులు ప్రారంభయ్యాయని, మరికొన్ని ప్రారంభ దశలో ఉన్నాయన్నారు. అనంతరం ఇంటి నిర్మాణం కోసం ఉపయోగిస్తున్న సిమెంట్, ఇనుము, ఇసుక ధరలు ఎలా ఉన్నాయి, వాటి కోసం ప్రభుత్వం వెచ్చించిన డబ్బులు సరిపోతున్నాయా లేదా అని లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా డబ్బులను అడిగితే తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో హౌజింగ్ ఏఈ స్వాతి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# భద్రాద్రి సమస్యలను విస్మరిస్తున్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలం, జూన్ 8: భద్రాచలం సమస్యలను ప్రజా ప్రతినిధులు విస్మరిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం స్థానిక చందర్‌రావు భవనంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీ వద్ద నిర్మిస్తున్న కరకట్ట పనుల జాప్యంతో మరోసారి ప్రజలకు ముంపు భయం పట్టుకుందని అన్నారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందడం లేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం గందరగోళంగా తయారైందని అధికారులు ప్రకటించిన పేర్లకు ఏమాత్రం పొంతన ఉండటంలేదన్నారు. ఇరిగేషన్ అధికారుల అంచనా ప్రకారం కరకట్ట నిర్మాణానికి రూ.100కోట్లు ఖర్చవుతాయని నివేదిక ఇచ్చిన ప్రభుత్వం మాత్రం కేవలం రూ.30కోట్ల అంచనాతో పనులు చేస్తుందని ఆరోపించారు. దీనిఫలితంగా మరోసారి పట్టణంలో సుభాష్‌నగర్ కాలనీ, కూనవరం రోడ్డు, శాంతినగర్, రామాలయం పరిసర ప్రాంతాలు ముంపునకు గురికాక తప్పదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం స్వామి, బండారు శరత్‌బాబు, సున్నం గంగ, ఎర్రంశెట్టి వెంకట రామారావు, పారెల్లి సంతోష్‌కుమార్, డి.సీతాలక్ష్మి, నాదెండ్ల లీలావతి, ఉస్తెల జ్యోతి, రమేష్, రాఘవయ్య, శ్రీనివాస్, కొరాడ శ్రీనివాస్, కనకశ్రీ పాల్గొన్నారు.

## పాల్వంచ అభివృద్ధికి ఎఫ్‌బీపీ కృషి

పాల్వంచ, జూన్ 8 : పాల్వంచ అభివృద్ధి కోసం ఫోరం ఫర్ బెటర్ పాల్వంచ(ఎఫ్‌బీపీ) అహర్నిశలు కృషి చేస్తున్నదని పలువురు వక్తలు తెలిపారు. ఆదివారం పాల్వంచలోని ఓ హోటల్‌లో నూకల రంగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రముఖులు మాట్లాడుతూ... పాల్వంచ పట్టణానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రజాప్రతినిధుల మీద ఒత్తిడి తెచ్చే బాధ్యత ఫోరం ఫర్ పాల్వంచ తీసుకుంటుందన్నారు. పాల్వంచ పట్టణంలో నూతన 800 మెగావాట్ల పవర్‌ప్లాంట్ స్థాపన, ఎన్‌ఎండీసీ పునర్వవస్థీకరణ, పట్టణానికి వివిధ కేంద్రీయ విశ్వవిద్యాసంస్థల స్థాపన, ఐటీ హబ్, ఇండస్ట్రీయల్ పార్కు, ఆటోనగర్ ఏర్పాటు, పాల్వంచ పట్టణానికి చెందిన పట్టణానికి మౌలిక సదుపాయాలు కల్పన వివిధ ప్రాజెక్టు చేపట్టాలన్నారు. సమావేశంలో మంతపురి రాజుగౌడ్, కాల్వ భాస్కర్, బుడగం రవి, కాపా కృష్ణమోహన్, వై.సాంబశివరావు, సైదులు, వెంకటనారాయణ, లక్ష్మీపతి, అభినవ్, శ్రీనివాస్‌కుమార్, కిషోర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, తులసీరాం, సత్యనారాయణ పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కొత్తగూడెం టౌన్, జూన్ 8 : సమ్మర్ క్యాంపు ముగిసిన సందర్భంగా అండర్ 12, 14, 16 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 11వ తేదీ వరకు బీకేడీసీఏ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరగనున్నాయి. తొలిరోజు పోటీలను కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని హేమచంద్రాపురంలోని బీకేసీఏ గ్రౌండ్‌లో ప్రారంభించారు. ఇటీవల కాలంలో క్రికెట్‌కి క్రేజ్ పెరుగుతుందని, ఇందులో భాగంగా చిన్నారులకు ఒక ప్రత్యేకమైన టోర్నమెంట్ నిర్వహించాలనే ఆలోచన రావడం హర్షనీయమన్నారు. కోచ్ సాయి నిరంజన్‌ను అభినందించారు. కార్యక్రమంలో బీకేడీసీఏ ఉపాధ్యక్షుడు డాక్టర్ బీఎస్ రావు, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి, విజయసింహారెడ్డి, జగన్, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

## 'మన మున్సిపాలిటీ-మన అభివృద్ధి'పై నేడు సదస్సు

అశ్వారావుపేట టౌన్, జూన్ 8: అభివృద్ధి ప్రణాళిక దృష్ట్యా సోమవారం 'మన మున్సిపాలిటీ-మన అభివృద్ధి'పై స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం ఉదయం 10 సదస్సు నిర్వహించనున్నట్లు కమిషనర్ కే.సుజాత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మహిళా కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

పాల్వంచ, జూన్ 8: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాల పాల్వంచలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను ఆహ్వానించినట్లు ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి తెలిపారు. బీఏ(హెచ్ఈపీ), బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీకాం జనరల్, బీఎస్సీ(ఎంపీసీ, ఎంఎస్‌సీఎస్, ఎంపీసీఎస్), బీజెడ్సీ, ఎంజెడ్సీ కోర్సులలో సీట్లు పొందేందుకు ఈ నెల 23వ తేదీలోపు కళాశాల ప్రాంగణంలో అడ్మిషన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న విద్యార్థులు తమ సర్టిఫికెట్లు తీసుకొని ఈ నెల 23వ తేదీ లోపు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాలకు రావాలని సూచించారు. మరింత సమాచారం కోసం 63003 56561, 9603697171 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## సింగరేణిలో 99శాతం బొగ్గు ఉత్పత్తి

కొత్తగూడెం సింగరేణి, జూన్ 8 : సింగరేణి సంస్థకు ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న బొగ్గు ఉత్పత్తిలో భాగంగా మే నెలాఖరు నాటికి 99శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగింది. లక్ష్య సాధన దిశగా సింగరేణి అడుగులు వేస్తోంది. సంస్థ వ్యాప్తంగా మే నెలలో 103 శాతం బొగ్గు ఉత్పత్తి చేసి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఏడాది యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిని పక్కా ప్రణాళికలతో వేసవి కాలంలోనే లక్ష్యాన్ని అధిగమించినట్లైతే వర్షాకాలంలో వర్షప్రభావం వల్ల కొంత వెనుకబడినప్పటికీ వేసవిలో చేసిన బొగ్గు ఉత్పత్తితో ఆ లోటును పూడ్చుకోవచ్చనే ఉద్దేశంతో బొగ్గు ఉత్పత్తి ప్రణాళికను సిద్ధం చేశారు. అందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1,09,28,400 టన్నులకు గాను 1,08,14,694 టన్నులు చేసి 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది.

## వాటర్‌కూలర్ బహూకరణ

చుంచుపల్లి, జూన్ 8 : తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఎన్‌కేనగర్ కాలనీకి చెందిన మోరంపూడి సునీల్‌కుమార్ తన తల్లిదండ్రులు రామకసత్యనారాయణ, తులసీల జ్ఞాపకార్థం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి వాటర్‌కూలర్‌ను బహూకరించారు. ఆదివారం దీనిని డీఎస్పీ రెహమాన్ చేతుల మీదుగా గ్రంథాలయ అధికారి మణిమృదులకు అందజేశారు. వి.శివకేశవరావు, శివరామకృష్ణ, ధర్మారావు, కామేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, సామ్యూల్, జోసెఫ్, మైనేని నాగేశ్వరరావు, బసవయ్య, గురుమూర్తి పాల్గొన్నారు.

## సీపీఐ గ్రామసభలు ప్రారంభం

లక్ష్మీదేవిపల్లి, జూన్ 8 : లక్ష్మీదేవిపల్లి మండలం ఏజెన్సీ గ్రామాల్లో ఆదివారం సీపీఐ గ్రామశాఖ మహాసభలు ప్రారంభమయ్యాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా పాల్గొని జెండా ఎగురవేశారు. తొలిరోజు మైలారం, బంగారుచెలక, చింతకుంట, పునుకుడు చెలకర, లక్ష్మీపురం, బొజ్జలగూడెం గ్రామశాఖల మహాసభలు జరిగాయి. తిప్పగుట్ట గిరిజన గ్రామ వీధుల్లో భారీ ర్యాలీ జరిగింది.

## జాతీయ రహదారిపై వీధిదీపాల ఏర్పాటు

రామవరం, జూన్ 8 : విజయవాడ- జగ్దల్‌పూర్ జాతీయ రహదారిపై సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ ప్రగతివనం వద్ద నుంచి త్రీ ఇంక్లైన్ బంగ్లోస్ వరకు ఇటీవల జరిగిన ప్రమాదాల్లో కొందరు మృతిచెందగా, అనేకమంది క్షతగాత్రులయ్యారు. రాత్రివేళ చీకటిగా ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుంటున్నాయి. ఈ క్రమంలో సింగరేణి కార్మికులు, యూనియన్ నాయకులు, స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు ఏరియా జీఎం శాలెంరాజు ప్రత్యేక చొరవ తీసుకొని ఏరియా డీజీఎం ఈఅండ్‌ఎం అధికారి శ్రీకాంత్‌ను ఆదేశించడంతో యుద్ధప్రాతిపదికన ఇప్పటికే ఒక్కొక్కటి రూ.లక్ష వ్యయంతో ఐదు లైటింగ్ టవర్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా నూతనంగా ఏరియా వర్క్‌షాప్ నుంచి ఐటీఐ జంక్షన్ వరకు సుమారు రూ.2 లక్షలతో 20 లైటింగ్ స్తంభాలను ఏర్పాటు చేశారు. దీంతో గతంలో చీకటిమయంగా ఉన్న ప్రాంతం ఇప్పుడు వెలుగులు విరజిమ్ముతోంది. అధికారులకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## మైనార్టీలను విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

రామవరం, జూన్ 8 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేబినేట్‌లో మైనార్టీలకు మంత్రి పదవి కేటాయించకుండా మొండిచేయి చూపించిందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్‌పాషా అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది మైనార్టీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. మైనార్టీ మంత్రి లేని కారణంగా గత కొన్ని నెలలుగా ఉన్న మైనార్టీ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు.

## సక్రమంగా బియ్యం పంపిణీ చేయాలి

అశ్వారావుపేట/అశ్వారావుపేట రూరల్, జూన్ 8: లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బియ్యం పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఆదేశించారు. ఆదివారం మండలంలోని రెడ్డిగూడెం రేషన్ షాపునుతనిఖీ చేశారు. తూకంలో తేడా ఉండొద్దన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## స్విమ్మింగ్‌కు వచ్చిన బాలికతో అసభ్యకర ప్రవర్తన

**నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

ఇల్లెందు, జూన్ 8: స్విమ్మింగ్ చేసేందుకు పూల్‌కు వచ్చిన ఓ 11 ఏళ్ల బాలికతో నిర్వాహకుడు అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఇల్లెందులో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ఇల్లెందు పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని ఇల్లెందు మున్సిపల్ పరిధిలోని చెరువుకట్ట లేక్ పార్కు స్విమ్మింగ్ పూల్‌కు ఆదివారం ఉదయం 8:30 గంటలకు వచ్చాడు. స్విమ్మింగ్ చేసే ముందు దుస్తులు మార్చుకునేందుకు ఆ ఇద్దరు బాలికలు స్త్రీలు దుస్తులు మార్చుకునే గదిలోకి వెళ్లారు. వారి వెనుక ఆ గదిలోకి వెళ్లిన పూల్ నిర్వాహకుడు.. 11 ఏళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో భయపడిన సదరు బాలిక గట్టిగా కేకలు వేసింది. అక్కడే ఉన్న ఆ బాలిక చెల్లి కూడా భయకంపితురాలై పరుగెత్తుకుంటూ తన తండ్రి వద్దకు వెళ్లింది. గదిలో నిర్వాహకుడి ప్రవర్తించిన నిర్వాకం గురించి చెప్పింది. ఇంతలో నిర్వాహకుడు కూడా అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సూర్య తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నాడు. వెతికి పట్టుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ విషయంపై ఎస్సై సూర్యను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా.. పూల్ నిర్వాహకుడు తమ అదుపులోనే ఉన్నాడని, కానీ అతడిపై ఎలాంటి ఫిర్యాదూ అందలేదని సమాధానమిచ్చారు.

## యువతి అదృశ్యం

కరకగూడెం,జూన్ 8: యువతి అదృశ్యమైన ఘటన కరకగూడెం మండలంలో చోటు చేసుకున్నది. ఎస్సై పీవీ నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి (23) శుక్రవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఆ యువతి అర్ధ రాత్రి దాటినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇంట వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. యువతి తండ్రి శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విద్యార్థిని ఆత్మహత్య

అన్నపురెడ్డిపల్లి, జూన్ 8: పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంట్లం గ్రామానికి చెందిన బొమ్మకంటి భవాని (18) ఇంటర్ చదువుతుంది. కడుపు నొప్పి తాళ లేక మే 26న ఇంట్లోని కలుపు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మం వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. మృతురాలి తండ్రి నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతురాలు తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాలువలో పడి రెండు దుక్కిటెద్దులు మృతి

గుండాల, జూన్ 8: బీఎస్‌ఎన్‌ఎల్ లైన్ కోసం తీసిన గుంటల్లో పడి రెండు దుక్కిటెద్దులు, రెండు మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని సాయనపల్లి గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైతు వీరస్వామికి చెందిన రెండు దుక్కిటెద్దులు ఇంటికి రాకపోవడంతో ఆదివారం సాయనపల్లి గ్రామపంచాయతీలోని చినవెంకటాపురం, బీమునిపాదం ప్రాంతంలో పరిశీలించగా కాలువలో పడి మృతిచెంది ఉన్నాయి. వీటి విలువ రూ.2 లక్షల ఉంటుందని రైతు పేర్కొన్నాడు. కాల్వ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరారు.

## నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, జూన్ 8: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తెలిపారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని తెలిపారు.